కథానిక

# చేమ మేసే కంచెలు

"శ్రీరాగి"

రజనీకాంతరావు ఆఫీసులో కూర్చొని ఆఫీసరు దగ్గరనుంచి అప్పుడే వచ్చిన టపా చూసుకొంటున్నాడు. వాటిలో ప్రభుత్వం వద్ద నుంచి వచ్చిన ఒక మెమోరాండం గుమాస్తా రజనీకాంతరావుదృష్టిని ఆకర్షించింది.

అందులో: "ఆఫీసు బంట్రోతులను ఆఫీసర్లు తమ స్వంత పనులకు ఉపయోగించుకొన్న సందర్భాలు అనేకం ప్రభుత్వం దృష్టికి తేబడినవి. ఇది ప్రభుత్వానికి చాలా అసంతృప్తి కలిగించే విషయం. ఆఫీసు బంట్రోతులు ఆఫీసు పనులను మాత్రమే చూచుటకు ఏర్పడినవారు. వారిని స్వంత బంట్రోతులుగా వాడుకొనుటకు ఆఫీసర్లకే అధికారమూ లేదు. ఇకముందు ఇట్టి సందర్భములు ప్రభుత్వ దృష్టికి తేబడిన, అందుకు సంబంధించిన అధికారులపై గట్టి చర్య తీసుకొనబడును" అని ఉన్నది.

ఈ మెమోరాండం చదివిన రజనీకాంతరావు "ఇటువంటి కాగితాలు రావటం మొదటిసారి కాదుగదా!" అనుకొన్నాడు.

ఇంతలో అతనికి ఆఫీసరు గదిలోనుంచి కాలింగుబెల్ వినపడ్డది.

మరుక్షణంలో ఆఫీసరు ఎదుట రజనీకాంతరావు హాజరైనాడు.

"ఏం చేస్తున్నావోయి" అన్నాడు ఆఫీసరు.

"మీ రిచ్చిన టపా చూస్తున్నాను సార్."

"ఆఁ వాటికేం, ఎప్పుడూ వచ్చే కాగితాలేగా? చూడు నీకు కొంచెం బజారు పనుంది. పోయొస్తావు గదూ?"

"ఇప్పుడే వెళ్ళొస్తాను, అదేమిటో చెప్తే" అన్నాడు రజనీకాంతరావు.

"ఏం లేదోయి. ఇంట్లో ఆవకాయ, అని ఒకటే గోల పెడుతున్నారు. కొత్త నువ్వు అయితే మంచి కాయ పంపిస్తావని."

"దానికేమండి. అలాగే. మంచి కాయ ఏరి కూలీచేత పట్టిచ్చుకొస్తాను."

"ఆఁ వంద మామిడికాయల భాగ్యానికి కూలెందుకోయ్. మన జమాను వెంకయ్యున్నాడుగా. వాణ్ణి తీసుకెళ్లు."

"చిత్త మలాగేనండి" అని నమ్రతతో జవాబిచ్చాడు.

రజనీకాంతరావు జమాను వెంకయ్యని వెంటబెట్టుకొని మార్కెట్టు కెళ్ళి మామిడికాయలు పట్టించుకొచ్చాడు. వారం పది రోజులనుంచి తన యింట్లో మామిడికాయలు కావాలని శ్రీమతి గోలపెడ్తున్నా, తన ఆఫీసు పనితోనూ ఆఫీసరు స్వంతపనులతోనూ తూగలేక వాయిదా వేస్తున్నాడు.

ఇంక వెంకయ్య సంగతి చెప్పనే అవసరం లేదు. పాపం మధ్యాహ్నం రెండు మెతుకులు ఎప్పుడు ఇంట్లో తింటాడో, మిగతా కాలమంతా ఆఫీసరు యింట్లోనే వెంకయ్య గడుపుతాడు.

* * *

డిప్యూటీ కలెక్టరు గోపాలం అయ్యంగార్ ఆఫీసులో కూర్చొని టపా చూసుకొంటున్నాడు.

ఆ టపాలో క్రిందిఆఫీసు జమాను వెంకయ్య పంపిన పిటీషను ఉంది. అది తెలుగులో ఉండటంచేత కలెక్టర్ తన హెడ్‌గుమాస్తాని పిలిచి అది చదవమన్నాడు.

ఆ పిటీషనులో ఇలావుంది:

"ఘనతవహించిన డిప్యూటీ కలెక్టరు దొరవారి సముఖమునకు:—తాసిల్దారు జమాను వెంకయ్య పంపుకొన్న విన్నపములు.

అయ్యా,

నేను సర్వీసులోచేరి పదిసంవత్సరాలయింది. అప్పటినుంచి తాసీల్దార్ల ఇండ్లలో వెట్టి చాకిరీ చెయ్యలేక చచ్చిపోతున్నాను. ప్రస్తుతం తాసీల్దారైన రామకృష్ణగారిని గురించి రెండు ముక్కలు మీకు విన్నవించుకొంటాను.

ఉదయం ఆరింటికల్లా నేను తాసీల్దారిగారింట్లో హాజరు కావాలి ఇక అక్కడినుంచి పిల్లల బళ్ళదగ్గరనుంచి కూరగాయలదాకా బజారుకు అయిదారుసార్లు తిరిగి తెచ్చియ్యాలి. నా ఖర్మం చాలక పనిమనిషి రాకపోతే ఆ అంట్లగిన్నెలుకూడా నా మొహాన పడేస్తారు. ఇంత చాకిరీ చేస్తూ ఒకరోజు సెలవిప్పించమంటే తాసీల్దారుగారు ఆకాశమంత ఎత్తున లేస్తారు.

ఉదయం ఆరింటి దగ్గరనుంచీ రాత్రి పది గంటలదాకా తాసీల్దారుగారింటికి కాపలా కాసినా, వాళ్ళఇంటి మంచినీళ్ళుకూడా నాకు ప్రాప్తముండదు. పిల్లికి బిచ్చం వెయ్యని మా తాసీల్దారుగారి భార్యను తలుచుకొంటేనే కడుపు నిండుతుంది ఎప్పుడైనా తాసీల్దారుగారన్నా. "ఒరే వెంకా, ఇంక ఇంటికెళ్ళరా పాపం!" అంటారేమోగాని ఆ మహాఇల్లాలి నోటినుంచి ఆ వాక్యం రాదు. వాళ్లు కాపలా కాసే బొచ్చుకుక్కకన్నా యింత పాలుఅన్నం వేస్తారేగాని, నా మొహాన యింత గంజినీరు పోసిన పాపాన పోలేదు.

తాసీల్దారుగారి ఏడాది పాపనుంచి ఇరవై ఏళ్ళ కుర్రాడిదాకా నాకు అయ్యగార్లు! తాసీల్దారుగారి రెండునెలల కూతురినుంచి భార్యగారిదాకా నాకు అమ్మగార్లు! డజన్లకొద్దీ పిల్లల్ని కనిపడేస్తారు అమ్మగార్లు మాబోటి జమాను మొహాలమీద! వాళ్ళ భారమంతా వహించటానికి పన్నెండురూపాయల బంట్రోతుగాళ్లం ఉన్నాం గదా!

పండగ పబ్బాలరోజుల్లోకూడా ఈ అయ్యగారిళ్ళలో మేము పడిగాపులు కాయాల్సిందే!

మా తాసీల్దారుగారు నెలకి మూడువందలో నాలుగువందలో సంపాదిస్తారు గదా, ఇంత వెట్టిచాకిరీ మాచేత చేయించుకొంటున్నందుకు, యెప్పుడైనా ఒక్కరూపాయి మా మొహాన పారేశారా? అబ్బే! అలాంటిది మేము ఆశించకూడదు వారూహించగూడదు.

నాలుగు రోజులక్రిందట స్వంత పనిమీద పరాయి ఊరు వెళ్లాల్సొచ్చి, రెండు మూడు రోజులు శలవిప్పించమని కాళ్ళావేళ్ళా బడి ప్రతిమాలితే—

"ఒరే వెంకా, మా అమ్మాయి పురిటికి ఇక్కడకొచ్చిన సంగతి నీకు తెలుసుగా. రేపో ఎల్లుండో పురుడు రానేవస్తుంది అప్పుడు నువ్వు లేకపోతే మంత్రసానికోసం ఎవరెళ్తారు? ఇంకా ఆ సమయంలో చాలా పనులుంటాయి. అవన్నీ ఎవరు చూస్తారు?" అన్నాడు.

"అయ్యా, నాకు చాలా అర్జంటు పనుందండీ. ఇక్కడికి పందమైళ్ళ దూరంలో నా కూతురు ఉంది. ఆమెకు జబ్బుగా వుందని జాబు వచ్చింది. చూసివస్తాను. రెండురోజులు శలవిప్పించండి" అంటే—

"నువ్వు పోయిమాత్రం యేం చేస్తావు? అల్లుడుండనే ఉన్నాడుగా. కావలస్తే నాలుగు రోజులయిన తర్వాత పోదువుగానిలే" అన్నాడు.

"పోనీ ఇంకో బంట్రోతు రాముయ్యున్నాడుగదా. వాడిని ఇంటిదగ్గర పనిచూసుకోమనండి" అంటే.

తాసీల్దారుగారు "ఆఁ వాడిమొహం. వాడికేంతెలీసురా. వాడు లాభం లేదు. నువ్వే ఉండా" అన్నాడు

ఇంట్లో నా భార్య ఒకటే గోల. కూతురు చచ్చిపోతుంటే, చూడటానికి కూడా పోవటం లేదని.

ఇంక తెగించి నా శలవు దరఖాస్తు ఆఫీసులో పడేసి నేను నా కూతురిని చూడటానికి వెళ్ళాను. వెళ్ళిన తర్వాత కూతురిని చూస్తే చాలా ప్రమాద స్థితిలో ఉంది. అల్లుడుచేతిలో డబ్బులేక దిక్కులు చూస్తుంటే, నేనే డాక్టరును తీసుకొచ్చి ఇంజక్షన్లు అవీ ఇప్పించుకొన్నాను.

ఇప్పుడు నా కూతురికి నెమ్మదిగానే వున్నది. నేను తిరిగి శలవు పెట్టిన నాలుగు రోజులు గడువు అయిపోగానే డ్యూటీకి వస్తే, తాసీల్దారుగారు నేను శెలవు మంజూరు కాకుండా డ్యూటీనుంచి యెగ్గొట్టానని చెప్పి, ఏదో కాగితము నాకిచ్చి సంజాయిషీ ఇమ్మన్నారు. తోడి బంట్రోతులు "నీకేదో మూడిందిరా వెంకా" అంటున్నారు. ఇదేనా న్యాయం? నన్ను తాసీల్దారుగారు సస్పెన్షనులో పెట్టారు.

మమ్మల్ని ప్రభుత్వం ఆఫీసు పనికి బంట్రోతులుగా నియమించిందా లేక అధికార్ల ఇళ్లలో స్వంతచాకిరీ చెయ్యటానికి నియమించిందా?

పై అధికారులయిన మీకు విన్నవించుకుంటే న్యాయం జరుగుతుందని ఆశిస్తూ తమ సమ్ముఖానికి ఈ మనవి పత్రం పంపుకొంటున్నాను.

ఇట్లు విధేయుడు,
జవాను వెంకయ్య
తాలూకాఫీసు."

పిటీషను విని డిప్యూటీ కలక్టరు "అబ్బో! చాలా గ్రంథం రాసేడే" అన్నాడు.

వెంటనే "ఒరే సుబ్బడూ" అని కేకేశాడు.

వాకిలిదగ్గర కాచుకొని ఉన్న సుబ్బడిదగ్గర నుంచి "చిత్తం వస్తున్నానండి" అని జవాబు వచ్చింది.

సుబ్బడు కలెక్టరెదుటికి వచ్చాడు.

"ఏంరా సుబ్బడూ, మూడు గంటలయిందిగా ఇంక ఇంటి కెళ్ళి కాఫీ, టిఫిన్ పట్టుకురా."

"చిత్తం, ఇప్పుడే వెళ్తున్నానండి" అంటూ సుబ్బడు గదిలోనుంచి బయటపడ్డాడు.

సుబ్బడు కలెక్టరుగారింటికి ఆ నడి ఎండలో మూడు గంటలవేళ వెళ్ళాడు.

కాఫీ పోసిన ఫ్లాస్కూ, టిఫిన్ కారియరు అందిస్తూ, కలెక్టరు భార్య సుబ్బడితో "అయ్యాగారితో చెప్పు, సాయంకాలం మేమంతా సినిమా కెళ్తామని. నువ్వు అయ్యగారిని అడిగి తొందరగా రా, మమ్మల్ని సినిమాకు తీసుకెళుదుగాని" అన్నది.

"అలాగేనమ్మా" అన్నాడు సుబ్బడు.

* * *

ఆ రోజున తాలూకాఫీసులో వెంకయ్య పిటీషనుమీద డిప్యూటీ కలెక్టరుగారు విచారణ చేస్తారు. తాసీల్దారు, వెంకయ్య హాజరైనారు.

డిప్యూటీ కలెక్టరు వెంకయ్యను పిలిచి "నువ్వు చెప్పదలచుకొన్నది చెప్పవచ్చు" అన్నాడు.

"నా పిటీషనులో వ్రాసిన వాటికంటే ఎక్కువ నేనేమీ చెప్ప తలచుకోలేదు" అన్నాడు వెంకయ్య.

"నువ్వు పిటీషనులో తాసీల్దారుగారింట్లో ఉదయం ఆరింటినుంచీ రాత్రి పదిగంటలదాకా పనిచేస్తున్నాను అన్నావు. ఈవిషయం ఋజువు పరచటానికి నీ కెవరైనా సాక్షులున్నారా?"

"దీనికి వేరేసాక్షు లెందుకండీ? తాసీల్దారుగారికి నేను వాళ్ళింటో చాకిరీ చేస్తున్న సంగతి తెలీదా?" అన్నాడు వెంకయ్య.

"ఏమండీ రామకృష్ణగారూ, మీరేమి సమాధానం చెప్తారు? వెంకయ్యచేత మీరు ఇంటి పనులు చేయించుకున్న మాట నిజమేనా?"

"అది శుద్ధ అబద్ధమండీ. నేను యెప్పుడూ వెంకయ్యని స్వంతపనుల కుపయోగించుకోలేదు. ఇంటిదగ్గర నాకు వేరే నౌకరున్నాడు. వాడికి నెలకు పదిహేనురూపాయలు జీతం యిస్తూ ఉంటాను."

"ఆ నౌకరును చూపించగలరా?"

తాసీల్దారు ఆఫీసునుంచి బయటికిపోయి రెండు నిమిషాలలో ఇంకోమనిషితో తిరిగి వచ్చాడు.

"ఇతనేనండీ మాయింటి నౌకరు. సంవత్సరంనుండీ మాయింట్లో పని చేస్తున్నాడు. ఇతని పేరు పిచ్చయ్య" అన్నాడు తాసీల్దారు.

"ఏమయ్యా, తాసీల్దారుగారు చెప్పేది నిజమేనా?" అన్నాడు కలెక్టరు.

"నిజమేనండి. నేను వారింట్లో సంవత్సరం నుంచి పనిచేస్తున్నాను" అన్నాడు పిచ్చయ్య.

వెంకయ్య, పిచ్చయ్యవంక ఆశ్చర్యంగా చూస్తున్నాడు. పిచ్చయ్యతో కలెక్టరు, వెంకయ్య వంక చూపిస్తూ, "ఇతని నెరుగుదువా? తాసీల్దారుగారింటిలో పనిచేస్తుండేవాడుటగా" అన్నాడు.

"ఇతడెవరో నే నెరుగనండి. నేనుండగా ఇతడెప్పుడూ తాసీల్దారుగారింటికి రాలేదు" అన్నాడు పిచ్చయ్య.

"ఏం వెంకయ్యా, నీ పిటీషనులోని విషయాలు శుద్ధ కల్పితాలుగా కనపడ్తున్నాయి. ఎవరన్నా సాక్షులుంటే హాజరుపెట్టు. లేకపోతే ఇదంతా అబద్ధమని నమ్మాల్సివస్తుంది" అన్నాడు.

"ఆఫీసుగుమాస్తా రజనీకాంతరావుగారిని మీరు విచారించవచ్చు" అన్నాడు వెంకయ్య.

రజనీకాంతరావుకు కలెక్టరు కబురుచేసేడు.

రజనీకాంతరావు హాజరైనాడు.

రజనీకాంతరావుని తాసీల్దారు ఆదివరకే బెదిరించి లోబరుచుకున్నాడు.

# జయంతి ట్యుటోరియల్ కాలేజి,

**48, హారిస్ రోడ్డు, పుదుపేట, మద్రాసు-2.**

* చిరకాలం మినర్వా కాలేజీలో పనిచేసిన ప్రొఫెసర్ జయంతి లక్ష్మీనారాయణగారు ఆంధ్ర విద్యార్థిలోకానికి క్రొత్తకాదు.
* కాని మీకు తెలుసునా? ప్రొఫెసరు జయంతి తన స్వంత ట్యుటోరియల్ కాలేజీ పై పేరున స్థాపించారు.
* గత సెషనులో ఇక్కడ చదివిన ఆంధ్ర విద్యార్థులలో నూటికి 90 మంది పైగా ప్యాసైనారు.
* చక్కని లెబొరేటరీ ఉంది. హాస్టలు సౌకర్యాలున్నాయి.

కోచింగు: I. A., I. Sc., I. A. Sc., & B. Sc.

## తరగతులు జూన్ 4 నుండి ప్రారంభం.

త్వరపడండి.

ప్రొఫెసర్ జయంతి లక్ష్మీనారాయణ, ఎం. ఏ.,
ప్రిన్సిపాల్.


"వెంకయ్యచేత తాసీల్దారు స్వంతపనులు చేయించుకొంటుండగా మీ రెప్పుడయినా చూసేరా?" అన్నాడు కలెక్టరు.

"నేనెప్పుడూ తాసీల్దారుగారు వెంకయ్యకు స్వంతపనులు పురమాయించటం చూడలేదు" అన్నాడు రజనీకాంతరావు.

రజనీకాంతరావు సాక్ష్యంకూడా తిరిగి పోవటంచేత వెంకయ్య తనకు న్యాయం జరుగుతుంది అనేఆశ వదులుకొన్నాడు.

"ఇక పిటీషనులోని రెండో విషయం వెంకయ్య సెలవుకోసం ముందుగా మిమ్మల్ని అడిగినమాట యథార్థమేనా?" అన్నాడు తాసీల్దారును చూసి కలెక్టరు.

"వెంకయ్య సెలవువిషయం నన్ను ముందుగా ఎప్పుడూ అడగలేదు. సెలవుకాగితం మాత్రం ఆఫీసులో ఇచ్చివెళ్ళాడు" అన్నాడు తాసీల్దారు.

"వెంకయ్య సెలవు మంజూరుకాకుండానే డ్యూటీకి రాలేదు కనుక శిక్షార్హుడు" అని కలెక్టరు తీర్పు ఇచ్చాడు.

వెంకయ్య తాసీల్దారుగారింటిలో పనిచేసినమాటకూడా అబద్ధమని తేలింది అని తన రిపోర్టులో డిప్యూటీ కలెక్టరు వ్రాస్తూ అబద్ధపు రిపోర్టు ఇచ్చినందుకు, డ్యూటీకి సెలవులేకుండా హాజరుకానందుకు, ఒకనెల సస్పెన్షను వెంకయ్యకు ఖాయంచేసేడు.

"ఆఫీసు బంట్రోతులచేత స్వంతపనులు చేయించుకోవద్దు. అది శిక్షార్హము" అని ప్రభుత్వము దగ్గరనుంచి వచ్చే జి. వో. లు రెవెన్యూబోర్డునుంచి జిల్లాకలెక్టర్లకు, జిల్లాకలెక్టర్లనుంచి డిప్యూటీకలెక్టరులకు అక్కడనుంచి తాసీల్దారులకు వరుసగా పంపబడుతునే వున్నాయి. జవానులుమాత్రం అధికార్ల ఇండ్లలో తమ ఓపికకొద్దీ చాకిరీ చేస్తూనే ఉన్నారు.